'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'కు విశేష స్పందన

ఫతేనగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు శనివారం మధ్యాహ్నం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రయాణికులు కూకట్‌పల్లి ఆర్టీసీ డీఎంకు ఫోన్ చేసి పలు సమస్యలు, సూచనలు, సలహాలు ఇచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. గతంలో జగద్గిరిగుట్ట నుంచి జేఎన్‌టీయూకు బస్సులు నడిపేవారని, ప్రస్తుతం వాటిని నడపడం లేదని, ఆ సర్వీసులను పునరుద్ధరించాలని కొందరు ప్రయాణికులు కోరారు. అదే విధంగా గతంలో కోఠి- సనత్‌నగర్ (45కే), సనత్‌నగర్- రాజేంద్రనగర్(9ఎం), సనత్‌నగర్-చాంద్రాయన్‌గుట్ట, సికింద్రాబాద్-బల్కంపేట వయా సనత్‌నగర్ (10పీ) బస్సు సర్వీసులను కూడా పునరుద్ధరిస్తే బాగుంటుందని పలువురు ప్రయాణికులు డీఎంకు సూచించారు. డ్రైవర్లు బస్సులను రోడ్లపై కాకుండా బస్టాపుల్లో ఆపేలా చూడాలని ఎన్నిసార్లు బస్టాపుల వద్ద ఉన్న కంట్రోలర్లకు చెప్పినా పట్టించుకోవడం లేదని కొందరు డీఎంకు ఫిర్యాదు చేశారు. ప్రయాణికుల సమస్యలను, సూచనలనుపై అధికారులకు వివరిస్తానని డీఎం హామీ ఇచ్చారు.

లింగంపల్లి, మియాపూర్‌ల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు పుష్పక్ ఏసీ బస్సులు

- **కూకట్‌పల్లి ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం అపర్ణ కల్యాణి**

ఫతేనగర్,మార్చి29(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మరిన్ని పుష్పక్ ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం అపర్ణ కల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు లింగంపల్లి, మియాపూర్ నుంచి బయలు దేరుతాయన్నారు. లింగంపల్లి నుంచి శంషాబాద్‌కు వెళ్లే బస్సులు ఆల్విన్ క్రాస్ రోడ్డు, కొండాపూర్ కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా ఎయిర్ పోర్టుకు చేరుకుంటాయన్నారు. మియాపూర్ నుంచి ఎయిర్ పోర్టుకు బయలు దేరే బస్సులు జేఎన్‌టీయూ, శిల్పారామం, రాయదుర్గం, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి మీదుగా ఎయిర్ పోర్టుకు చేరుకుంటాయన్నారు. మియాపూర్ నుంచి మొదటి బస్సు 00.15 చివరి బస్సు రాత్రి 1.45, లింగంపల్లి నుంచి మొదటి బస్సు ఉదయం 5.45కు, చివరి బస్సు రాత్రి 8.45 వరకు ఉంటుందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



శ్రీరామ నవమి వేడుకలకు ఆహ్వానం

కూకట్‌పల్లి సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 6న జరిగే శ్రీరామ నవమి వేడుకలకు హాజరు కావాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆలయ అర్చకులు కోరారు. శనివారం బండి రమేష్ దంపతులను వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. **-(బాలానగర్, ఆంధ్రజ్యోతి)**

లక్ష్యం దిశగా ఆస్తిపన్ను వసూళ్లు

- **వడ్డీలో 90శాతం డిస్కౌంట్‌కు నేడు, రేపు అవకాశం**
- **రెవెన్యూ ఉద్యోగులకు ఉగాది, రంజాన్ సెలవులు రద్దు**

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి): మరో రెండు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులకు ఉగాది, రంజాన్ సెలవులు ఉన్నా.. జీహెచ్ఎంసీ మూసాపేట, కూకట్‌పల్లి సర్కిల్స్ డీసీలు, రెవెన్యూ విభాగం ఉద్యోగులకు ఎలాంటి సెలవులు లేవు. బల్దియా నుంచి ఇచ్చిన టార్గెట్స్ చేరుకోవడం కోసం మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల అధికారులు ఉదయం, సాయంత్రం అన్న తేడా లేకుండా శ్రమిస్తున్నారు. మొండి బకాయిలతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన వారి నుంచి ప్రాపర్టీ ట్యాక్స్ రాబట్టేందుకు గత 45 రోజులుగా పడరాని పాట్లు పడుతున్నారు. మరో రెండు రోజుల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తిపన్ను ఉన్నతాధికారులు ఇచ్చిన లక్ష్యం దిశగా వేగం పెంచారు.

జంట సర్కిళ్లలో పరిస్థితి ఇదీ ..

కూకట్‌పల్లి జోన్ పరిధిలో ఐదురు సర్కిల్స్ ఉండగా.. మూసాపేట, కూకట్‌పల్లి సర్కిల్స్ జోనల్ కార్యాలయ ఆవరణలోనే ఉండటం కాస్త ఇబ్బందిగా ఉందని చెప్పవచ్చు. దానికి తోడు జంట సర్కిల్స్ డిప్యూటీ కమిషనర్లు భారతి వంశీకృష్ణ, బండి గంగాధర్ ఆరు నెలల క్రితమే ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. వీరు బాధ్యతలు స్వీకరించే సమయానికే ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన, కుల గణన సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రేషన్ కార్డుల సర్వే ఉండటంతో ఆ ప్రభావం ఆస్తిపన్ను వసూళ్లపై పడింది. ఎలాగైనా ప్రాపర్టీ ట్యాక్స్ టార్గెట్స్‌ను పూర్తిచేయాలన్న తలంపుతో ఫిబ్రవరి మూడో వారంలో ప్రారంభించిన వేగం ఏ మాత్రం తగ్గకుండా ముందుకు సాగుతున్నారు. మూసాపేటలో రూ.116 కోట్లు టార్గెట్ కాగా.. ఇప్పటికే రూ.100 కోట్లు వసూళ్లు దాటేశారు. ఇక కూకట్‌పల్లిలో రూ.91 కోట్లు కాగా ఇప్పటికే రూ.80 కోట్లు రాబట్టారు. దీంతో రెండు సర్కిల్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆరు వారాలుగా ఎలాంటి సెలవులు తీసుకోకుండానే పనిచేస్తున్నారు. సమయ వేళలు కాకుండా నివాస, నివాసేతర యజమానులు ఎప్పుడు అందుబాటులో ఉంటే అప్పుడు వారి వద్దకు వెళ్లి వసూళ్లు చేసే దానికి శ్రీకారం చుట్టారు. కూకట్‌పల్లిలో నోటీసులతో డీసీ బయపెడుతుండగా.. మూసాపేటలో ఏకంగా సీజ్ చేసి దారిలోకి తెచ్చుకొని సక్సెస్ అయ్యారు. సీజ్ చేసిన పలు భవనాల యజమానులు అదే రోజు సాయంత్రానికి 60శాతం పైగా చెల్లిస్తుండటం గమనార్హం.

నగరాభివృద్ధిలో భాగస్వాములు కండి

సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి హైదరాబాద్ నగరాభివృద్ధిలో భాగస్వాములు కండి. పెండింగ్ ప్రాపర్టీ ట్యాక్స్ ఈనెల 31వ తేదీలోపు చెల్లించి వడ్డీలో 90శాతం డిస్కౌంట్ పొందండి. ఏళ్ల తరబడి ఆస్తిపన్ను చెల్లించకుండా ఉంటామంటే కుదరదు. చిన్నా, పెద్దా అనే తేడా ఏమి ఉండవు. ఆస్తిపన్ను విషయంలో ఎవ్వరికీ మినహాయింపులు లేవు. ప్రాపర్టీ ట్యాక్స్ తీసుకునేందుకు ఈనెల 30, 31వ తేదీల్లో మీ వద్దకు వస్తున్న ఉద్యోగులకు సహకరించండి. అలాగే, జంట సర్కిళ్ల పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు మూసాపేట జీహెచ్ఎంసీ కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సీఎస్‌ఈ సెంటర్‌లో ఈనెల 30,31 (ఆది, సోమవారం) తేదీల్లోఆస్తి పన్ను చెల్లించవచ్చు.

- భారతి వంశీకృష్ణ, బండి గంగాధర్,
జంట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు

నేడు ఆంజనేయుడు, గరుత్మంతుడి విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

కూకట్‌పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రామాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఆంజనేయ స్వామి, గరుత్మంతుడి విగ్రహాల ఏర్పాటుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్లు దేవాలయ ఈఓ అంజయ్య తెలిపారు. ఆలయ రాజగోపుర ప్రధాన ద్వారానికి ఒకవైపు ఆంజనేయుడి, మరోవైపు గరుత్మంతుడు విగ్రహాలను ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు. భూమిపూజలో స్థానిక కార్పొరేటర్లు, గ్రామ పెద్దలు, మాజీ చైర్మన్లు, ఆండాళ్ కుంకుమార్చాన సంఘం సభ్యులు, భక్తులు పాల్గొనాలని ఈఓ కోరారు.



రామాలయంలో ఏర్పాటు చేయనున్న ఆంజనేయ, గరుత్మంతుడి విగ్రహాల నమూనా చిత్రాలు

ఐశ్వర్య సిద్ధి..ఆరోగ్యమస్తు!

- తెలుగు పండుగలకు ఆది ఉగాది
- నేటి నుంచి ప్రారంభం కానున్న విశ్వావసునామ సంవత్సరం
- ఉగాదిని ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమైన ప్రజలు
- ఆరోగ్యం, ఐశ్వర్యం సిద్ధించాలని పూజలు

కూకట్‌పల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలుగు పండుగులకు ఆది ఉగాది. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాల మధ్య జరుపుకుంటారు. నేడు క్రోధినామ సంవత్సరాన్ని పూర్తి చేసుకుని విశ్వావసునామ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. ఈ ఉగాది ప్రజలకు విశ్వాసం, సిరిసంపదలను అందిస్తుందని పండితులు చెబుతున్నారు. మామిడి తోరణాలు, ఉగాది పచ్చడి, పంచాంగ పఠనం, కవి సమ్మేళనాలు, కమ్మనైన పిండి వంటలు, షడ్రుచుల సమ్మేళనంతో జరుపుకునే ఉగాదికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.



భరత్‌నగర్‌లో ఉగాది పచ్చడికి కావాల్సిన వేప పువ్వు కొనుగోలు చేస్తున్న మహిళలు






ఉగాది సందర్భంగా కూకట్‌పల్లి రోడ్లపై పూలు, మామిడికాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

నూతన సంవత్సరానికి ఆది ఉగాది

తెలుగు వారి నూతన సంవత్సరానికి ఆది అయిన ఉగాది నాడు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా సందడి వాతావరణం కనిపిస్తుంది. వాకిళ్లను రంగవల్లలతో అలంకరిస్తారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కడతారు. సుఖ సంతోషాలతో జీవించాలని తమ ఇష్టదైవాలను కోరుకుంటారు. దేవాలయాలను సందర్శిస్తారు. ఉగాది రోజు పంచాంగం పఠనం ఓ ప్రత్యేకం. పలు సంస్థలు, దేవస్థానాలు, పలు కాలనీల్లో పండితులతో పంచాంగ పఠనం నిర్వహిస్తారు. పంచాంగం జన్మనక్షత్రం లేదా నామ నక్షత్రం ఆధారంగా వ్యకిగత జీవిత అంశాలు, వారి ఆదాయం, వ్యయాలతో పాటు సమాజంలో వచ్చే గౌరవం, రాజకీయం, ఉద్యోగం తదితర అంశాలను విశ్లేసిస్తూ పంచాంగ పఠనం చేస్తారు.



మార్కెట్‌లో అమ్మకానికి పెట్టిన పంచాంగం పుస్తకాలు

ఆధునిక కాలంలోనూ తగ్గని ఆదరణ

బాలానగర్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలంలోనూ ఉగాది పండుగకు ఆదరణ పెరుగుతోంది తప్ప.. ఏమాత్రం తగ్గడం లేదు. పండుగను సంతోషంగా జరుపుకునేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు ప్రజలు దుకాణాల వద్ద క్యూ కడుతుండటంతో వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్ కిరాణా షాపుల వద్ద సందడి నెలకొంటోంది. బతుకు పోరులో పర్వదినాలు, ఆనందకర సందర్భాలను మరిచిపోతున్నప్పుడు తెలుగుదనాన్ని, కుటుంబ ప్రేమలను, తెలుగు రుచులను ఉగాది పండుగ గుర్తుకు తెస్తున్నదని నగర వాసులు చెబుతున్నారు. షడ్రుచుల కలబోతగా ఉండే ఉగాది పచ్చడి ఆరోగ్య ప్రదాయని అంటూ దీని ప్రత్యేకతను వివరిస్తున్నారు. ఉగాది పచ్చడి రుగ్మతల నివారిణి అని ఆయుర్వేద వైద్యులు సైతం చెబుతున్నారు.

వ్యాపారులకు లాభాలు, కుటుంబాల్లో సంతోషం



మార్చి 30న విశ్వావసు నామ సవంత్సరం ప్రారంభమవుతుంది. తెలుగు సంవత్సరాల ప్రకారం ఇది 39వ ఏడాది. కలియుగం లెక్కల ప్రకారం 5,126 వ సంవత్సరం. ఈ ఏడాది అధిపతి సూర్య భగవానుడు. ఈసారి పంచాంగం ప్రకారం వ్యాపారులకు లాభాలు, కుటుంబాల్లో సంతోషం ఉంటుంది. దేశాల మధ్య వైరం, యుద్ధ వాతావరణం తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

- పృథ్వీకృష్ణ, ప్రసన్న వెంకటేశ్వరస్వామి
ఆలయ అర్చకుడు, కూకట్‌పల్లి

ఉగాది శుభాకాంక్షలు



తెలుగు ప్రజలకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. కొత్త సంవత్సరంలో ప్రజల సంకల్పం దిగ్విజయంగా నెరవేరాలి. ఉగాది పచ్చడిలాగే జీవితంలో కష్టసుఖాలు ఉంటాయి. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలి. అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నా.

- మాధవరం కృష్ణారావు,
కూకట్‌పల్లి ఎమ్మెల్యే

ఉగాది వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉగాది సందర్భంగా ఆలయాలను పూలమాలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలతో పాటు పంచాంగ శ్రవణం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయాల నిర్వాహకులు తెలిపారు. కేపీహెచ్‌బీ 3వ ఫేజ్‌లోని బ్రహ్మంగారి ఆలయంలో జరిగే వేడుకలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరవుతున్నారు.



కిషన్, రవీందర్ రావులను సత్కరిస్తున్న రిజిస్ట్రార్, రెక్టార్, డైరెక్టర్లు

భవిష్యత్తులోనూ మరింత ఉత్సాహంగా ఉండండి

- **ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు జేఎన్‌టీయూ రెక్టార్ పిలుపు**

హైదరాబాద్ సిటీ, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ జీవితంలో పని చేసినట్లుగానే భావి జీవితాన్ని మరింత ఉత్సాహంగా గడపాలని.. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న వర్సిటీ ఉద్యోగులకు జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఫారిన్ రిలేషన్స్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషన్, యూజీసీ అఫైర్స్ విభాగంలో సూపరింటెండెంట్ రవీందర్‌రావు ఈ నెల 31తో రిటైర్ అవుతున్న సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు శనివారం వారిద్దరినీ ఘనంగా సత్కరించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు వర్సిటీలోని వివిధ విభాగాల్లో పనిచేసి, అందరి మన్ననలు పొందిన వీరిద్దరినీ తరువాత తరం ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సన్మాన కార్యక్రమంలో జేఎన్‌టీయూకే మాజీ వైస్‌చాన్స్‌లర్ తులసీ రాందాస్, యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ వినయ్‌బాబు, ఆర్అండ్ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్, డీయూఎఫ్ఆర్ డైరెక్టర్ వసుమతి, యూజీసీ అఫైర్స్ డైరెక్టర్ జయలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ సెల్ సమన్వయకర్త మాధవీకుమారి, ఉద్యోగ సంఘాల నేతలు శంకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

సమతానగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

ఫతేనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లోని సమతానగర్‌లో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి శనివారం పర్యటించారు. స్థానికంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమతానగర్‌లో కరెంటు స్తంభాల అవసరం ఉందని, వీధి దీపాలు కూడా వెలగడం లేదని స్థానికులు తనకు చెప్పారని, ఈ సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహులు, సతీష్‌గౌడ్, నారాయణ, లింగస్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్పొరేటర్

ఫతేనగర్ డివిజన్ జింకలవాడ మసీద్ వద్ద సల్మాన్ ఫరూక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాల్గొన్నారు. ముస్లిం పెద్దలకు, ఇఫ్తార్ నిర్వాహకులకు పండు తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేసి రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు.

పేకాట స్థావరంపై ఎస్ఓటీ దాడి

- **నిర్వాహకుడి పరారీ**
- **9 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కైత్లాపూర్ రోడ్డులోని రెయిన్‌బో విస్టాస్ గేటెడ్ కమ్యూనిటీలోని ఓ ఫ్లాట్‌లో కొనసాగుతున్న పేకాట స్థావరంపై బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం ఈ దాడి జరిగింది. నిర్వాహకుడు జయవర్ధన్‌రెడ్డి తప్పించుకోగా, పేకాటాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ వారిని నుంచి పోలీసులు రూ.54,430 నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా, జయవర్ధన్‌రెడ్డి తమకు ఫోన్ చేసి ఆహ్వానించాడని, డబ్బులు పెట్టించి గేమింగ్ ఆడిస్తుంటాడని విచారణలో పోలీసులకు పట్టుబడ్డ వారు వెల్లడించారు. నిర్వాహకుడితో పాటు వీరిపైనా గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రదర్శనలోని వస్త్రాలను పరిశీలిస్తున్న సందర్శకులు

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

కూకట్‌పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): షాపింగ్ ప్రియులు క్రొత్తగా దొరికే ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారు. వివాహాది శుభకార్యాలతో పాటు ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులను మహిళలు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బోరబండ చౌరస్తాలోని మోతీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద కళాసిల్క్స్ ఆధ్వర్యంలో చేనేత హస్తకళా ప్రదర్శన మొదలైంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్స్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కళంకారి, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ వంటివి మహిళలను ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రవేశం ఉచితమని, మరో వారం రోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఉగాది పురస్కారానికి రచయిత్రి యలమర్తి అనూరాధ ఎంపిక

అల్లాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి యలమర్తి అనూరాధకు విశేష గౌరవం దక్కనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే ఉగాది పురస్కారానికి ఈమె ఎంపికయ్యారు. ఉగాది సందర్భంగా పంచాంగ పఠనం, అవధానం, సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రకళ, శిల్పకళ, నాటక, జానపద కళలు మిమిక్రీ తదితర రంగాల్లో విశేష సేవలందిస్తున్న వంద మందిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది పురస్కారాలకు ఎంపిక చేయగా, అందులో యలమర్తి అనూరాధకు చోటు దక్కింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈరోజు జరిగే 'విశ్వావసు నామ ఉగాది' కార్యక్రమంలో అనూరాధ పురస్కారం అందుకోనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనను ఉగాది పురస్కారానికి ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందని అనూరాధ తెలిపారు.

బోరబండ ఎంఎంటీఎస్ స్టేషన్ నుంచి రైళ్ల రాకపోకల సమాచారం

అల్లాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బోరబండ ఎంఎంటీఎస్ స్టేషన్ నుంచి లింగంపల్లి, హైదరాబాద్, ఫలక్‌నుమ (వయా సికింద్రాబాద్) వైపునకు రైళ్లు రాకపోకలు సాగించే సమయ సూచికలు, రైల్వే స్టేషన్‌లో అధికారులు ఇచ్చిన సమాచారం. ++ గుర్తు కల్గిన ట్రైన్ సోమవారం నుంచి శుక్రవారం వరకు అని అర్థం. అనివార్య కారణాల వల్ల ట్రైన్ రద్దు కావడం, సమయ సూచికలో మార్పులు జరిగినా స్టేషన్ అధికారులను సంప్రదించాలి.

లింగంపల్లి వైపునకు:

ఉదయం 05:57, 06:12, 06:30++, 07:22, 08:17, 08:32, 09:02, 09:42, 09:42, 10:17, 10:17, 10:27++, 11:12
సాయంత్రం 16:57, 17:42++, 17:57, 18:27, 19:22, 19:15++
రాత్రి 20:22, 20:42++, 29:02, 29:07, 29:42++, 22:12, 22:37, 23:17++అర్ధరాత్రి 00:17

ఫలక్‌నుమ వైపునకు (వయా బేగంపేట, సికింద్రాబాద్, కాచిగూడ, మలకపేట)

ఉదయం 04:16, 06:16, 07:01, 07:41++, 8:46, 09:15, 09:51, 10:41
సాయంత్రం 16:31++, 17:29, 17:56++, 18:16, 18:56++, 19:36
రాత్రి 20:16++, 29:41, 29:51, 22:29, 23:05++, 23:40
హైదరాబాద్ వైపునకు... (వయా బేగంపేట, ఖైరతాబాద్, లక్డికాపూల్)2
ఉదయం 07:20, 08:15, 10:05
సాయంత్రం 16:20++, 17:30, 19:10
రాత్రి 20:13, 29:25

- మేడ్చల్‌కు (వయా బేగంపేట, సంజీవయ్య పార్కు, జేమ్స్ స్ట్రీట్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, సఫిల్‌గూడ, రామకృష్ణాపురం, అమ్ముగూడ, అల్వాల్, బొల్లారం, గుండ్ల పోచంపల్లి, గౌడవల్లి,) ఉదయం 10:26 సాయంత్రం 18:46.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో. రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా 11, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీ మిర్చి 23, కాకర 35, బీర 35, క్యాబేజీ 10, బీన్స్ 55, క్యారెట్ 18, దొండ 28, చిక్కుడు 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 35, ఆలు 23, కీర 15, కంద 65, ఉల్లి 24, చామగడ్డ 40, చిలగడదుంప 30, పచ్చిబఠాణీ 40, కాకర 60. పైన పేర్కొన్న ధరలు ఈ ఉదయం 9.30 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. టపాసులు కాల్చి కేక్‌లు కట్ చేసి పార్టీ దిమ్మెల వద్ద తెలుగుదేశం జెండాలను ఆవిష్కరించారు. అన్నీ వర్గాల సంక్షేమం కోసం పాటుపడే ఏకైక పార్టీ టీడీపీ అని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అట్లూరి దీపక్, శివనారాయణ, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, కొల్లూరి శ్రీనివాస్, ఉమా, రేఖ పాల్గొన్నారు.

మూసాపేటలో..

కూకట్‌పల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని గూడ్స్ షెడ్ రోడ్డులో టీడీపీ పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పు రామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ వేడుకలునిర్వహించారు. టీడీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాముగౌడ్, వాసుదేవరావు, రామారావు, అనిల్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీలోని రమ్యగ్రౌండ్ వద్ద కేక్‌కట్ చేస్తున్న ఉప్పల పద్మాచౌదరి, ఎస్కే. సత్తార్ తదితరులు



వసంతనగర్‌లో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎన్టీఆర్ అసోసియేషన్ ప్రతినిధులు కిలారు శ్రీనివాసబాబు తదితరులు



మూసాపేటలో ఉప్పు రామకృష్ణ ఆధ్వర్యంలో...



బాలాజీనగర్‌లో నందమూరి సుహాసిని అక్క యువసేన అధ్యక్షుడు హరి సురేష్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

- విశ్వావసు నామ సంవత్సరాదికి పంచాంగాలు సిద్ధం
- మార్కెట్‌లో జోరుగా పూలు, పండ్ల విక్రయాలు

ఉగాది సందడి

ఖైల్‌కాలనీ, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు అత్యంత ఘనంగా జరుపుకునే పండుగల్లో ప్రధానమైనది ఉగాది. తెలుగు సంవత్సరాది ఉగాదితో మొదలవుతుండడంతో ఈ పండుగకు విశిష్టత నెలకొనడమేకాకుండా సిద్ధాంతపరంగా ఉగాది పండుగతోనే రాశిఫలాలు ఆరంభమవుతుండడం వల్ల ఈ పండుగలో పంచాంగ శ్రవణం ప్రధానంగా మారింది. వైద్య, పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వినూత్న మార్పులు వస్తున్నప్పటికీ పంచాంగంపైనే పూర్తిగా ఆధారపడడం దాని విశిష్టతను తెలియచేస్తుంది. గ్రహణాలు, వివాహాలు, నామకరణాలు, అపరకర్మలను తిథి, వార, నక్షత్రాల ద్వారా నిర్ణయించే ఆచారం అనాధిగా వస్తోంది. కాగా ప్రతీ శుభకార్యాన్ని ప్రారంభించే ముందు తిథి వారనక్షత్రాన్ని పరిశీలించి



మార్కెట్‌లో పూల విక్రయాలు

శుభఘడియల్లో పనులను ప్రారంభించడం హిందూ ధర్మంలో వస్తున్న ఆచారం. దీంతో ప్రతీ పనికి పంచాంగమే పునాదిగా మారుతోంది. ఈ సంవత్సరాదికి విశ్వావసు నామకరణ ముండగా వివిధ సిద్ధాంతులు, మఠాధిపతులు, వేదపండితులు, వివిధ దేవస్థాన ఆచార్యులు గణాంకాలు వేసి, తమతమ విధానంతో రూపొందించిన పంచాంగాలు దేవాలయాలు, పుస్తక దుకాణాల్లో అందుబాటులోకి వచ్చాయి.

జోరుగా పూలు, పండ్ల అమ్మకాలు

చందానగర్, శేరిలింగంపల్లి ప్రధాన పూలమార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ఉగాది పర్వదినం నాడు వేపపువ్వుతో షడ్రుచులతో తయారు చేసిన ప్రసాదాన్ని స్వీకరించడం సాంప్రదాయంగా వస్తుండడంతో వేపపువ్వు, మామిడి ఆకులు, పళ్లు తదితర పూజా సామగ్రి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. కాగా పూలకు విపరీతంగా డిమాండ్ పెరగడంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.



వివిధ సిద్ధాంతులచే రూపొందించిన పంచాంగాలు

ఆలయాల్లో నేడు పంచాంగ శ్రవణం

పలు ఆలయాల్లో ఆదివారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నారు. చందానగర్‌లో వేంకటేశ్వర స్వామి దేవాలయం, హుడా ట్రేడ్ సెంటర్‌లో గల శ్రీ రామాలయం, బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల వేంకటేశ్వర స్వామి ఆలయం. ఎంఐజీకాలనీలో గల శ్రీరామాలయాల్లో పంచాంగ శ్రవణం జరుగనుంది. రాశి ఫలాలు, పంటలు, శుభసూచికాలు వంటి వాటిపై శ్రవణం జరుగుతుంది.

నేడు ధర్మపురిక్షేత్రంలో వేడుకలు

మియాపూర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని శ్రీ ధర్మపురిక్షేత్రంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ గొట్టిపాటి సత్యవాణి తెలిపారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని సన్మానించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలి

- భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబి.రాజా

ఖైల్‌కాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది సందర్భంగా భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబి.రాజా, భెల్ అధికార కార్మిక సంఘం బీయూఈటీయూసీ అధ్యక్షుడు కృష్ణంరాజు, ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేందర్, ఓబీసీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రామ్‌రాజ్, నాగమోహన్, పలు గుర్తింపు కార్మిక సంఘాలు, అసోసియేషన్‌ల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులకు, అధికారులకు పండుగ శుభాకాంక్షలను తెలియచేస్తూ కరపత్రాలను విడుదల చేశారు.

వేడుకలకు మసీదుల ముస్తాబు



భెల్ టౌన్‌షిప్‌లోగల మసీదు

ఖైల్‌కాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలందరు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ ప్రార్థనల కోసం మసీదులు సుందరంగా ముస్తాబయ్యాయి. భెల్ ఎంఐజీ కాలనీ, విద్యుత్‌నగర్, బీహెచ్ఇఎల్ టౌన్‌షిప్ తదితర ప్రాంతాల్లో గల మసీదుల్లో సోమవారం జరిగే ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తికాగా భెల్ టౌన్‌షిప్‌లో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన మసీదులో ప్రత్యేక ప్రార్థనలు, రంజాన్ వేడుకలకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భెల్ టౌన్‌షిప్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు మసీదు వద్ద ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు.

ప్రత్యేక సౌకర్యాలు కల్పించండి: కార్పొరేటర్

మసీదుల ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి అధికారులకు సూచించారు. నిర్వాహకులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదికంగా పనులు చేపట్టాలన్నారు. మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, రోడ్ల మరమ్మతులు తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్శ్‌రెడ్డి, భాస్కర్, సంపత్, గిరి, సుధాకర్, తిలావత్ పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ముస్లిం మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ముస్లిం మహిళలకు దుస్తుల పంపిణీ

హైదర్‌నగర్,మార్చి29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కార్యాలయంలో కార్పొరేటర్ దుస్తులు పంపిణీ చేశారు. రంజాన్ పండుగను అందరు సోదరభావంతో సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, ఫారూఖ్, ఖలీమ్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్న రవియాదవ్

రంజాన్ తోఫాల పంపిణీ

గచ్చిబౌలి, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ సోదరులకు రంజాన్ సందర్భంగా తోఫాలు ఇవ్వడం బీఆర్ఎస్ ఆనవాయితీ అని దీనిని కొనసాగిస్తామని ఆ పార్టీ నాయకుడు రవియాదవ్ అన్నారు. శనివారం శేరిలింగపల్లి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి పాత గ్రామంలో సుమారు 200 నిరుపేద మైనార్టీ కుటుంబాలకు వైఆర్‌వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు.

ఉత్తమ విద్యార్థికి చేయూత



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న కొండావిజయ్

ఖైల్‌కాలనీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చదువులో రాణిస్తున్న ఉత్తమ విద్యార్థికి లయన్స్ క్లబ్ - హోప్ చేయూత అందించింది. చందానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ విద్యలో రాణిస్తున్న విద్యార్థి కార్తీక్‌కు పదవతరగతి చదువుకోసం రూ.25 వేల చెక్కును అందచేశారు. కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు పేదవిద్యార్థులకు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కోశాధికారి మర్రి ప్రవీణ్, క్యాబినెట్ సెక్రటరీ లయన్ శ్రీధర్, రీజనల్ అధ్యక్షుడు కరుణాకర్ గౌడ్, లయన్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్, ఒకరు పరారీ

మియాపూర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై మియాపూర్, మాదాపూర్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ రైడ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌ను ఉపయోగించి క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న ఐదుగురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు, హోండా 121 కార్, ఆన్‌లైన్ బ్యాలెన్స్ నగదు రూ.20లక్షలు స్వాధీనం చేసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి క్రిక్ 24/7, నైస్ 7777, వైటపీ 2020 యాప్‌లను ఉపయోగించి బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని తెలుసుకుని దాడి చేసి వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో నిందితులు

- మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట రైల్వేస్టేషన్ వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు రెండుకిలోల 700గ్రాముల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్ర పర్లికి వెళ్లి అమ్‌జాద్‌కువెళ్లి గంజాయి కొనుగోలు చేసి నగరానికి తరలిస్తున్న పాపిరెడ్డికాలనీ జగద్గిరిగుట్టకు చెందిన విద్యార్థులు వెంకట సత్యనరేష్మస్వామి, గద్దె దీపక్, ఎండీ అమ్‌జాద్ వీరిలో ఇద్దరిని పట్టుకోగా ఆమ్‌జాద్ పరారీలో ఉన్నాడు.

64 చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే



పెద్దకుడిచెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను సుందర శోభితవనాలుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం మియాపూర్‌లోని పటేల్‌చెరువు, పెద్దకుడి చెరువు, రామసముద్రం కుంట, నాయనమ్మకుంట, హఫీజ్‌పేటలోని కైదమ్మకుంట చెరువులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, మల్లిగవాడ్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నెక్సస్ సెలక్ట్‌మాల్స్ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువులకు పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కాలనీల వాసులు కూడా సహకరించి చెరువుల వద్ద చెత్తాచెదారం వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీఎస్ఆర్ ఐటీ సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, నాయకులు బాలింగ్ గౌతం గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, ప్రవీణ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దూబేకాలనీ రోడ్డును లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు అనుసంధానం చేయాలి

గచ్చిబౌలి, మార్చి29 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని దూబేకాలనీ వాసులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. కాలనీ పది అడుగుల రోడ్డును కాలనీ పక్కనే ఉన్న లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు అనుసంధానం చేయాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం కమిషనర్ రంగనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు రాకపోకలకు ఇరుకుగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. దీనికి స్పందించిన రంగనాథ్ త్వరలోనే కాలనీని సందర్శిస్తామని హామీ ఇచ్చినట్లు సంక్షేమసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో రవికుమార్‌యాదవ్, బాల్దా అశోక్

'వన్ నేషన్ వన్ ఎలక్షన్' పై అవగాహన

మియాపూర్, మార్చి29(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎంతో అవసరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. శనివారం మియాపూర్ మయూరినగర్, విడియాకాలనీ, జేపీఎన్‌నగర్ దేవాకాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, సభ్యులతో 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవికుమార్‌యాదవ్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ బాల్దా అశోక్ ముఖ్యఅతిథిగా హాజరైమాట్లాడుతూ దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు జరిగితే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏబీసీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌గౌడ్, మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, నాయకులు మనోహర్, మాణిక్‌రావు, వెంకటస్వామిరెడ్డి, గణేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం



నిజాంపేట రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కొడాలి రవికుమార్,



వివేకానందనగర్‌లో కేకు తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు

చందానగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం శేరిలింగంపల్లి, చందానగర్ డివిజన్‌లలో పార్టీ నాయకులు టీడీపీ జెండాను ఎగురవేసి వేడుక జరుపుకున్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జేపీ.నగర్, సిద్ధిక్‌నగర్‌లో గల ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆర్‌ఆర్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద టీడీపీ జెండాను ఎగురవేసి వందనం నిర్వహించారు. 43 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 43 కేజీల కేకును కట్ చేసి పంచిపెట్టారు. కార్యకమంలో పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సామా భూపాల్‌రెడ్డి, యూత్ నాయకులు నల్లమల రాకేష్ చౌదరి, కర్రీ నానీ, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్టా వెంకటేష్‌గౌడ్, నాయకులు శ్రీహరి యాదవ్, విజయ్‌కృష్ణ, కోటేశ్వరరావు, సుబ్బారావు, అట్లూరి చిట్టిబాబు,ఆనంద్, ఈశ్వర్ గౌతమ్, శ్రవణ్, రమేష్‌తో పాటు టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాంపేట రోడ్‌లో..

హైదర్‌నగర్, మార్చి29(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ నిజాంపేట రోడ్‌లో కొడాలి రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వి రావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, కెఎస్ఎస్‌రాజు, బ్రహ్మయ్య, సిహెచ్ లక్ష్మణరావు, రవీంద్రనాథ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆశలకు స్వాగతం

నేడు ఉగాది పర్వదినం

కుత్బుల్లాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : చేదు జ్ఞాపకాలను పారదోలి కొత్త ఆశలను నెరవేర్చుకునేందుకు నిర్వహించేది ఉగాది పండుగగా చెప్పుకోవచ్చు. ప్రతియేటా తిథి పాడ్యమితో ప్రారంభమవుతుంది. ఈ పండుగ ఆరు రుచుల సమ్మేళనం. బ్రహ్మదేవుడు చైత్య పాడ్యమి నాడు ప్రపంచ సృష్టిని ప్రారంభించాడని, అందువల్ల దీన్ని యుగాది(ఉగాది) అంటున్నాం. ఉగాది రోజున ఉదయం ఇంటిని శుభ్రం చేయడం, అందంగా ముగ్గులు వేసి, గుమ్మాలకు మామిడి తోరణాలను అలంకరించడం జరుగుతుంది. నూతన వస్త్రాలను ధరించి వసంతలక్ష్మికి స్వాగతం పలుకుతారు. వనవాసం పూర్తి చేసుకుని శ్రీరాముడు, సీత, లక్ష్మణ సమేతంగా అయోధ్యకు ఉగాది రోజున తిరిగి వచ్చాడని ప్రజలు చెప్పుకుంటారు. బ్రహ్మదేవుడిని పూజించే ఏకైక పండుగగా ఉగాదిని చెప్పుకుంటారు. ఈ పండుగను పురస్కరించుకుని ఇంటిల్లిపాది తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరులను పానకంగా తయారు చేసుకుని భక్తిశ్రద్ధలతో సేవిస్తారు. ఈ పానకాన్ని మట్టి కుండలో చేసుకుని తీసుకోవడం వల్ల రోగాల నుంచి విముక్తి కలుగుతుందని తెలుగు ప్రజల నమ్మకం. ఈ ఉగాది శ్రీవిశ్వావసు నామ సంవత్సరంగా పురోహితులు స్పష్టం చేశారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు



చింతల్ మార్కెట్‌లో మామిడి ఆకులు, వేప, చింత పండు తదితర వస్తువులు

షడ్ రుచులు...

ఉగాది పర్వదినం సందర్భంగా చేసుకునే తయారుచేసే పానకం షడ్ రుచులకు సంబంధించిన తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు వస్తువులను ప్రజలకు ఉపయోగించే వస్తువులు మార్కెటల్‌లో శనివారమే అందుబాటులో ఉన్నాయి. కొత్త మామిడి కాయలు, వేప పువ్వు, చింత పండు, కారం, ఉప్పు, బెల్లం వేస్తారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కుత్బుల్లాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీకి చెందిన కొంతమంది లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో రూ.47 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో శనివారం లబ్ధిదారులకు కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్, డివిజన్ల అధ్యక్షులు మహ్మద్ రఫీ, విజయ్‌రాంరెడ్డి, పుప్పాల భాస్కర్, యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్‌లు చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, గుమ్మడి మధుసూన్ రాజు, సంపత్‌మాధవరెడ్డి, ప్రభాకర్ గుప్త, తోకల నగేష్‌రెడ్డి, సమ్మయ్య నేత, విజయ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరించిన వీరబాబు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

జీడిమెట్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమని టీడీపీ మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ జనరల్ సెక్రటరీ వీరబాబు అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ చేసిన సేవలు తెలుగు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు. టీడీపీ హయాంలోనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్‌కుమార్, రమేష్, సుబ్రమణ్యం, ఏసుబాబు, మధు, ఈశ్వర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో నిలిచిన మహానుభావుడు

పేట్‌బషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు పేదల గుండెల్లో నిలిచిపోయిన మహానుభావుడని టీడీపీ నాయకులు దోనె రామ్మోహన్‌రావు అన్నారు. టీడీపీ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన టీడీపీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్సింగరావు, సాంబశివరావు, నాగభూషణం, లింగయ్య, బాలరాజ్, చలపతిరావు, నర్సింహామూర్తి పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్



● నిజాంపేట కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ ప్రజల ఆస్తి పన్ను చెల్లింపులకు సంబంధించి 30న ఉగాది, 31న రంజాన్ పండుగల సెలవు రోజుల్లో కూడా ప్రజలు ఆస్తిపన్ను చెల్లించవచ్చని, వసూలు చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉంటారని కమిషనర్ సాబేర్ అలీ ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణ ప్రజలు కౌంటర్‌లో ఆస్తి పన్నులు చెల్లించాలని కోరారు. ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్సు ఫీజులు సకాలంలో చెల్లించి నిజాంపేట పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు.



● దుండిగల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయక్

దుండిగల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపులకు సంబంధించి 30న ఉగాది, 31న రంజాన్ పండుగల సెలవు రోజుల్లో కూడా ఆస్తి పన్నులు చెల్లించవచ్చని, వసూలు చేయడానికి సిబ్బంది సిద్ధంగా ఉంటారని కమిషనర్ వెంకటేశ్వర్లు నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ కూడా ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు కౌంటర్‌లో ఆస్తి పన్నులు చెల్లించాలని కోరారు. ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్సు ఫీజులు సకాలంలో చెల్లించి దుండిగల్ పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇంటి పన్ను చెల్లింపుకు గడువు ఇవ్వాలి

నిజాంపేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి ప్రాంతాల్లో ఇంటిపన్ను పెండింగ్‌లో ఉందనే నెపంతో అధికారులు ఇంటింటికి తిరిగి విద్యుత్, తాగునీటిని కట్ చేస్తామని, డ్రైనేజీ బంద్ చేస్తామని హెచ్చరికలు చేస్తున్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా శనివారం పలు నివాసాలకు డ్రైనేజీ లైన్లను బంద్ చేశారు. పేదల సమస్యను అర్థం చేసుకుని మరికొంత సమయం గడువిచ్చేలా చూడాలని స్థానికులు విన్నవించుకుంటున్నారు.



క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసం : కొలన్

నిజాంపేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీనివాసనగర్ కాలనీ ఎస్ఆర్‌డీఏ బ్యాడ్మింటన్ లీగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. శనివారం వారిని అభినందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉల్లాసం, ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. సమస్యలు, మానసిక ఒత్తిడి ఉన్నా మర్చిపోవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహించేవిధంగా క్రీడాకారులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్రీడల కోసం స్టేడియాలను నిర్మించుకునేందుకు కలిసికట్టుగా పని చేద్దామన్నారు. కార్యక్రమంలో 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎ.మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఫణి, బాలకృష్ణ, ఎస్ఆర్‌డీఏ సభ్యులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యార్థి మృతి



యశ్వంత్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఫ్లెక్సీ బోర్డును ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం తుర్కయాంజాల్ బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన రవికుమార్, వరలక్ష్మి దంపతుల కుమారుడు రమావత్ యశ్వంత్(20) మేడ్చల్ జిల్లా మైసమ్మగూడలోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదుతున్నాడు. శుక్రవారం కళాశాలకు వచ్చి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు స్నేహితుడు అభినవ్‌తో ద్విచక్ర వాహనంపై కలిసి బయలు దేరాడు. దూలపల్లి వెళ్లే రోడ్డులో మూలమలుపు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న ఫ్లెక్సీ బోర్డుకు ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడిపోయారు. యశ్వంత్‌కు తీవ్ర గాయాలు కాగా, అభినవ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, స్నేహితులు పోలీసులకు సమాచారం ఇచ్చి, సమీపంలోని ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. వాహనాన్ని నడుపుతున్న యశ్వంత్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి రవి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ సంఘం సభ్యులు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ వెస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆయనను శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లకాలంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని అన్నారు. కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్రలు కీలకమని, సభ్యులంతా ఒక తాటిపై ఉన్నప్పుడే కాలనీ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమసంఘం నూతన అధ్యక్షులు టి. వి.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌కుమార్, కోశాధికారి అప్పలరాజు పాల్గొన్నారు.



సంఘం సభ్యులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

● పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో దళిత సంఘాల ఐక్య వేదిక 307 నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిశారు. కలిసినవారిలో నూతన అధ్యక్షులు ఎం.రామచందర్, ప్రధాన కార్యదర్శి మేకల ఎల్లయ్య, కోశాధికారి జిజె రత్నం, ఆంజనేయులు, సాయిబాబా, కిషన్‌రావు, గట్టు అశోక్, ఎన్ సత్యనారాయణలు ఉన్నారు.

నైపుణ్యంతో అటవీ సమస్యలు పరిష్కరించాలి



అటవీ అధికారులతో రాష్ట్ర ముఖ్య వన్యప్రాణి సంరక్షణాధికారి ఎల్యుసింగ్ మేలు

పేట్‌బషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను వినియోగించి క్షేత్రస్థాయిలో అటవీ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్య వన్యప్రాణి సంరక్షణ, ప్రధాన అటవీ ముఖ్య సంరక్షణాధికారి ఎల్యుసింగ్ మేలు అన్నారు. దూలపల్లి అటవీ అకాడమీలో 36వ అటవీ బీట్ అధికారుల ప్రవేశ శిక్షణా కార్యక్రమం, 7వ బ్యాచ్ అటవీ సెక్షన్ ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమాల ఉమ్మడి స్నాతకోత్సవం శనివారం జరిగింది. 2024 అక్టోబరు 1న ప్రారంభమైన బీట్ అధికారుల ఆరు నెలల శిక్షణ శనివారంతో ముగిసింది. శిక్షణ పొందిన బీట్ అధికారులు మొత్తం 58, వీరిలో 19 మంది మహిళా అధికారులు ఉన్నారు. ఈ స్నాతకోత్సవానికి పలువురు సెక్షన్ అధికారులు హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న వారందరిని అధికారులు అభినందించారు. అటవీ వన్యప్రాణి రక్షణలో నిబద్ధతతో పని చేయాలని వారికి అటవీ అకాడమీ సంచాలకులు ఎస్‌జె ఆశ సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ అకాడమీ అదనపు సంచాలకులు ఎస్ రమేష్, డిప్యూటీ డైరెక్టర్లు పి. సాగర్, బి. వెంకటేశ్వరులు, కె. శ్రీనివాస్ , శిక్షణా అటవీ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలతో కొలన్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మహనీయుల ఆలోచనా విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పరిరక్షణకు మహాత్మాగాంధీ, అంబేడ్కర్ లాంటి మహనీయుల ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు 'జై బాపూ జై భీమ్ జై సంవిధాన్' కార్యక్రమంలో భాగంగా కొంపల్లి పురపాలక సంఘం పట్టణ అధ్యక్షులు బి.ప్రశాంత్ గౌడ్ అధ్యక్షతన సమావేశం కమ్యూనిటీ హాల్లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతో కమిషనర్ కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు

కార్మికులకు చేయూతనివ్వాలి

పేట్‌బషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎండల నుంచి రక్షణకు పారిశుధ్య కార్మికులకు టోపీలను అందజేయడం అభినందనీయమని కొంపల్లి పురపాలక సంఘం కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. సంకల్ప ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనేజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన, ఫౌండేషన్ చైర్మన్, పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షులు సతీష్‌సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డిలతో కలిసి ఆయన పారిశుధ్య కార్మికులకు టోపీలను పంపిణీ చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు చేయూతనివ్వాలని కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం కార్మికులకు భోజన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జనార్ధన్‌రెడ్డి, సరిత, శివాజీరాజు, అశోక్, మాధురి, దుర్గ, మధు, ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్, మహేందర్, మల్లిఖార్జున్, మురళీ కృష్ణ, తిరుపతి, కార్మికులు పాల్గొన్నారు.



చెత్తను తొలగించి ముగ్గులు వేసిన మున్సిపల్ సిబ్బంది

చెత్త వేయకుండా ముగ్గులు

కుత్బుల్లాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-2 రింగురోడ్డు నుంచి సుచిత్ర వెళ్లే రోడ్డు పక్కన స్థానికులు ఇళ్లలోని చెత్తను తీసుకువచ్చి డంపింగ్ చేస్తున్నారు. చెత్తతో దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించారు. మరోసారి ఎవరూ చెత్తను వేయకుండా అక్కడ ముగ్గులు వేశారు. చెత్తను వేస్తే జరిమానా విధిస్తారని అధికారులు తెలిపారు.



విద్యార్థులతో జోత్స్నశివారెడ్డి, ఉపాధ్యాయులు

విద్యార్థులకు చేయూత

పేట్‌బషీరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతనివ్వాలని అంతర ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు కందాడి జోత్స్న శివారెడ్డి అన్నారు. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాలలో అంతర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు దాతలు, ప్రజాప్రతినిధులు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యురాలు కందాడి పద్మ, మేడ్చల్ జిల్లా లేబర్ సెల్ అధ్యక్షులు కె.సుదర్శన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.